ఆంధ్రప్రభ 16-3-2000

రంగురాళ్ళ తవ్వకం

# హంగుదార్ల ఆటకట్టినట్టేనా?

**రంగురాళ్ళగనుల తవ్వకాలను ఆదివాసీలకే అప్పగించాలని రంపచోడవరం ప్రాజెక్టు ఆఫీసరు పంపించిన సూచనలను అమలు చేయడానికి ప్రభుత్వం ముందు ఏ అవరోధమూ లేదు. కానీ ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి 1999 మార్చి నెలలో అందినా, దాదాపు సంవత్సర కాలం ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. చివరికి ఇద్దరు ఆదివాసీ యువకులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన తరువాత హైకోర్టుతో చెప్పించుకోవడమెందుకనుకున్నారో ఏమోగానీ రంపచోడవరం ప్రాజెక్టు ఆఫీసర్ సూచనలను ఆమోదిస్తూ జి. వో. జారీ చేశారు. ఇంక అది కాగితాల మీదనే ఉండిపోకుండా అమలు చేయించుకోవడానికి ఆదివాసీలు, ఆదివాసీ సానుభూతిపరులు ఎంత ప్రయాసపడవలసి ఉందో !**



బాలగోపాల్

ఎట్టకేలకు ఉత్తరాంధ్ర అడవులలోని రంగురాళ్ళ వేటను రాష్ట్ర ప్రభుత్వం చట్టం పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. తూర్పు గోదావరి ఏజెన్సీ నుండి శ్రీకాకుళం ఏజెన్సీ దాకా విస్తరించి ఉన్న అడవులలో నీలమణి, చంద్రకాంతం, వైఢూర్యం వంటి విలువయిన రంగురాళ్ళ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. 5 వేల కోట్ల రూపాయల విలువ గల నిక్షేపాలున్నాయని ఒక అంచనా. ఈ నిక్షేపాలు ఇక్కడితో ఆగిపోలేదు. తూర్పు కనుమల పొడవునా ఒరిస్సాలోనూ ఉన్నాయి.

రంగురాళ్ళ నిక్షేపాలున్న ప్రాంతం ఆదివాసీలు నివసించే షెడ్యూల్డు ప్రాంతమేకాక రిజర్వ్ ఫారెస్టు కూడా. రెండు రకాలుగానూ అక్కడ రంగురాళ్ళ తవ్వకానికి మైనింగ్ లైసెన్సులు పొందడం గిరిజనేతర వ్యాపారస్తులకు కష్టసాధ్యం. కాబట్టి రంగురాళ్ళ వ్యాపారంలో చేయి తిరిగిన మార్వాడీలు దీనికొక పద్ధతి కనిపెట్టారు. ఒరిస్సాలో కనిపెట్టిన ఈ పద్ధతిని ఉత్తరాంధ్రలో కూడా ఆరేళ్ళనాడు ప్రవేశపెట్టారు.

ఏజెన్సీకి సమీపంలోని ఒక మండల కేంద్రాన్నో, తాలూకా కేంద్రాన్నో ఎంచుకుని అక్కడ మకాం పెడతారు. తూర్పు గోదావరి జిల్లాలో ఏలేశ్వరం, విశాఖపట్నం జిల్లాలో నర్సీపట్నం దీనికి ఉదాహరణలు.

అక్కడ ఒక లాడ్జిలో మకాం పెడతారు. స్థానిక గిరిజనేతర దళారులను ఎంచుకుని ఏజెన్సీలోకి పంపిస్తారు. వాళ్ళు నేలకు దగ్గరగా రంగురాళ్ళు దొరికే స్థలాల గురించి వాకబు చేస్తారు. వాళ్ళకు ఆ సమాచారం చెప్పేదీ ఆదివాసీలే. ఆ తరువాత రాళ్ళు తవ్వి అందించేదీ ఆదివాసీలే.

రాళ్ళ తూకాన్ని బట్టి వారికి ఎంతో కొంత ముట్టజెప్తారు. రోజు కూలీకి అడవి పనిలో దక్కేదానికంటే అది ఎక్కువే కావచ్చు కానీ ఆ రాళ్ళ విలువ కంటే చాలా చాలా తక్కువ. ఆ రకంగా విలువైన రంగురాళ్ళు చేజిక్కించుకున్న వ్యాపారస్తులు వాటిని జైపూర్‌కో, మరెక్కడికో తీసుకుపోయి సానపెట్టి ఆభరణాల తయారీదార్లకు అమ్ముకుంటారు.

కథ ఇంతే అయితే అందరికీ అంతో ఇంతో లాభమే కదా అనుకోవచ్చు. కానీ రంగురాళ్ళ తవ్వకం ఆదివాసీలకు ప్రాణాంతకంగా తయారయింది. ఖనిజాల తవ్వకం చాలా నైపుణ్యంతో కూడిన పని. తవ్వేనకొద్దీ పైన ఒక 'కప్పు' ఏర్పడుతుంది. అది కూలిపోకుండా 'సపోర్ట్' పెట్టుకుంటూపోవడం గనుల తవ్వకంలోని ప్రాథమిక జాగ్రత్త.

దానికి కావలసిన నైపుణ్యం కానీ, అసలు ఆ పాటి అవగాహన కానీ లేని ఆదివాసీలు ఏ జాగ్రత్తలూ తీసుకోకుండా తవ్వుకుంటూ పోవడం వల్ల 'కప్పు' కూలి ప్రాణాలు పోగొట్టుకోవడం ఈ ఆరేళ్ళలో చాలాసార్లు జరిగింది. 1994 నుండి ఇప్పటిదాకా 11 'గని ప్రమాదాలు' జరిగి 42 మంది చనిపోయారు. అందులో మొట్ట మొదటి ప్రమాదం —అదే అతి పెద్ద ప్రమాదం —ఏజెన్సీకి వెలుపల జరిగింది. విశాఖపట్నం జిల్లాలోని పప్పు శెట్టి పాలెం గ్రామం దగ్గర అప్పట్లో జోరుగా సాగిన 'రంగురాళ్ళ' తవ్వకం అజాగ్రత్తవల్ల పెద్ద ప్రమాదానికి గురయి 1994 సెప్టెంబర్ 4 న 15 మంది గిరిజనేతరులు చనిపోయారు.

ఆ తరువాత జరిగిన పది ప్రమాదాలు ఏజెన్సీలోనే జరిగాయి. చనిపోయిన వారంతా ఆదివాసీలే. తాము చేస్తున్నది 'నేరం' అనే భయం ఆదివాసీలలో ఉండడం వల్ల ఈ గని ప్రమాదాలు జరిగినప్పుడు గుట్టుచప్పుడు కాకుండా ఉండిపోయారు తప్ప ఎవరికీ చెప్పరు. అందువల్ల వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపడితే దక్కగల ప్రాణాలు కూడా ఈ ప్రమాదాలలో పోతున్నాయి.



1997 నవంబర్ 25 న విశాఖపట్నం ఏజెన్సీలోని కొర్రపాడులో జరిగిన ఘోరమైన విషాదం దీనికొక దృష్టాంతం. ఆ ఘటనలో చనిపోయినది నలుగురు ఆదివాసీలు. నలుగురూ హైస్కూలు విద్యార్థులే. వాళ్ళు కొంత కాలంగా తల్లిదండ్రులకు సహితం తెలియకుండా దొంగతనంగా తమ గ్రామానికి దగ్గరున్న 'గని' లో రంగురాళ్ళ కోసం తవ్వుతున్నారు. వాళ్ళ దృష్టిలో వాళ్ళు రెండు రకాలుగా నేరస్థులు. రంగు రాళ్ళు తవ్వే ఆదివాసీలందరి లాగా చట్టం కళ్ళలో నేరస్తులే. అదికాక తల్లిదండ్రులను ధిక్కరించి తవ్వడం వల్ల ఇంకొక రకంగానూ నేరస్థులు. అప్పటికే 'గని ప్రమాదాల' లో కాళ్ళు చేతులు విరగడం, ప్రాణాలు పోవడం చాలాసార్లే జరిగి ఉంది కాబట్టి తల్లిదండ్రులు పిల్లల పైన నిషేధం పెట్టారు.

పిల్లలేం చేశారంటే పెద్దలంతా నిద్ర పోయిన తరువాత లాంతరు తీసుకుని పోయి ఆ గుడ్డి వెలుతురులో తవ్వుతున్నారు. అసలే ప్రమాదం నిండిన ఆ పనిని మరింత ప్రమాదభరితం చేసుకున్నారు. చివరికి ఆ రాత్రి గనికప్పు కూలి నలుగురు చనిపోగా, వారితో ఉన్నవారు విషయం బయటికి పొక్కితే పెద్దలేమంటారోనని ఎవరికీ చెప్పకుండా తమ గ్రామాలకు వెళ్ళిపోయారు. ఆ రాత్రే చెప్పి ఉంటే నలుగురిలో ఒకరిద్దరి ప్రాణాలేమైనా దక్కేవేమో.

ఆదివాసీలలో అనవసరమయిన నేరభావన కల్పించిన ఘనత ప్రభుత్వానిది. అడవిలో దొరికే ఏ సంపదనయినా తమదిగా భావించి యధేచ్ఛగా అనుభవించడం ఆదివాసీ సంస్కృతి. రంగురాళ్ళను అంతకంటే భిన్నంగా చూడవలసిన అవసరం ఆదివాసీలకు లేదు. ఎవరో దళారులు బయటి నుంచి వచ్చి రంగురాళ్ళకు రకాన్ని బట్టి పంద గ్రామాల కింత ఇస్తామంటే రాళ్ళకోసం తవ్వుతున్నారు. దొరికినవి అమ్ముతున్నారు. పోలీసులూ, అటవీ శాఖ అధికారులూ దాడులు చేసి మామూళ్ళు బలవంతంగా వసూలు చేసినప్పుడు, తమ పలుగునూ, పారనూ జప్తు చేసుకున్నప్పుడూ తాము చేస్తున్నది 'నేరం' అని వారికి అర్థమయింది. దానివల్ల జరిగిందేమిటంటే ఆ 'నేరం' చేసే క్రమంలో జరిగే ప్రమాదాలను గోప్యంగా ఉంచి మరింత ప్రాణనష్టం తెచ్చుకుంటున్నారు.

అటువైపు, నేరం చేస్తున్నామని తెలిసీ చేస్తున్న వ్యాపారస్తులకు మాత్రం నేరభావనా లేదు. పోలీసుల వేధింపులూ లేవు. పోలీసులకూ, అటవీ శాఖ వారికీ కొంత ముట్టజెప్పి హాయిగా లక్షలు సంపాదించుకుంటున్నారు.

ఆదివాసీలకు ఆదాయం అందియ్యగల రంగురాళ్ళ తవ్వకాన్ని నేరంగా మార్చి ఆ నేరానికి మూలమైన గిరిజనేతర వ్యాపారస్తులను అదుపు చేయక ఆదివాసీలను వేధించడమే దానికి పరిష్కారంగా ఎంచి, తవ్వకాలలో చనిపోయే ఆదివాసీల చావులు వారి స్వయంకృతాపరాధం అని చేతులు దులుపుకునే బదులు ఆ రంగు రాళ్ళ గనులను ఆదివాసీ సంఘాలకే లీజుకిచ్చి వారికి గని తవ్వకంలో శిక్షణ ఇస్తే వాళ్ళయినా బాగుపడతారు కదా అన్న సూచన రాకపోలేదు కానీ మన రాష్ట్ర పాలకులు దానిని పట్టించుకోలేదు. ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను సీరియస్‌గా తీసుకుని అమలు చేయడం ద్వారా వేలాది ఆదివాసీ కుటుంబాలకు జీవనాధారం లభించిందన్న విషయం ప్రచారమైన తరువాత కూడా మన రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక లేదు. అటువైపు కొన్ని నెలలకొకసారి గని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆదివాసీలు చనిపోతూనే ఉన్నారు.

చివరికి రాష్ట్ర ప్రభుత్వంలో అధికారి అయిన రంపచోడవరం ఐ. టి. డి. ఏ. ప్రాజెక్టు ఆఫీసర్ చొరవ తీసుకున్నాడు. డివిజన్ స్థాయికి చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికార్లనూ, ఏజెన్సీ గ్రామాల సర్పంచ్‌లనూ, వన సంరక్షణ సమితి అధ్యక్షులనూ, ఆదివాసీ శ్రేయోభిలాషులైన వ్యక్తులనూ సమావేశపరిచి 'రంగురాళ్ళ సమస్య' పైన ఒక కమిటీ వేసి ఏం చేస్తే బాగుంటుందో సూచనలిమ్మన్నాడు.

ఐ. టి. డి. ఏ. చొరవతో ఆదివాసీ యువకుల సహకార సంఘాలు ఏర్పాటు చేసి వారికే రంగురాళ్ళ గనులు లీజుకిచ్చి తవ్వకంలో తర్ఫీదు కూడా ఇస్తే ప్రమాదాలూ తగ్గుతాయి. ఆదివాసీల జీవితాలూ బాగుపడతాయి అని వాళ్ళు సూచించారు. ఈ సూచనకు చట్ట రూపం ఇవ్వడానికి కావలసిన అవకాశాలు చట్టంలోనూ, రాజ్యాంగంలోనూ ఉన్నాయి. షెడ్యూల్డు ప్రాంతాలలో ఆదివాసీలకు తప్ప వేరే ఎవ్వరికీ మైనింగ్ లీజులు ఇవ్వడానికి వీలులేదని గనుల (నిర్వహణ, అభివృద్ధి) చట్టంలోని సెక్షన్ 11 ఏ (ఇది మన రాష్ట్రానికి మాత్రమే వర్తించే సవరణ) అంటుంది. ఆదివాసీలకు ఇయ్యవచ్చునన్న అర్థం అందులో ఇమిడి ఉంది. '1 ఆఫ్ 70' చట్టం కూడా ఈ మాటే అంటుంది.

ఏజెన్సీలో ఉన్నది రిజర్వ్ ఫారెస్టు కాబట్టి కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఈ పని చేయలేమన్న అభ్యంతరానికి తావులేదు. ఆదివాసీ ప్రాంతాలకు ఏ చట్టాన్నయినా తనకు ఉచితమని తోచిన మినహాయింపులతో వర్తింపజేసే అధికారాన్ని రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు రాష్ట్ర గవర్నర్‌కు (అంటే రాష్ట్ర ప్రభుత్వానికి) ఇచ్చింది.

అందువల్ల రంపచోడవరం ప్రాజెక్టు ఆఫీసరు పంపించిన సూచనలను అమలు చేయడానికి ప్రభుత్వం ముందు ఏ అవరోధమూ లేదు. కానీ అతను తన ప్రతిపాదన పంపించింది 1999 మార్చి నెలలో కాగా, దాదాపు ఒక్క సంవత్సర కాలం ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. చివరికి ఇద్దరు ఆదివాసీ యువకులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన తరువాత హైకోర్టులో చెప్పించుకోవడమెందుకనుకున్నారో ఏమోగానీ రంపచోడవరం ప్రాజెక్టు ఆఫీసర్ సూచనలను ఆమోదిస్తూ జి. వో. జారీ చేశారు.

ఇంక అది కాగితాల మీదనే ఉండిపోకుండా అమలు చేయించుకోవడానికి ఆదివాసీలు, ఆదివాసీ సానుభూతిపరులు ఎంత ప్రయాసపడవలసి ఉందో !